సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 24 । జూన్ । 2025



హరహర మహాదేవ

వేములవాడ: రాజన్నను సోమవారం 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు.

- వివరాలు 8లో..



సారూ.. పట్టించుకోండి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి భారీగా బాధితులు తరలివచ్చారు. సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

- వివరాలు 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రైవేట్‌స్కూల్ వాహనాలు అడ్డుకున్న గ్రామస్తులు



బండపల్లిలో ప్రైవేట్ పాఠశాల వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని బండపల్లి గ్రామస్తులు సోమవారం ప్రైవేట్ స్కూల్ వాహనాన్ని అడ్డుకున్నారు. బండపల్లి నుంచి 65 మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారని, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య 24కు పడిపోవడంతో బడి మూతపడే దశకు చేరుకుంటోందని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులు సోమవారం ఏకమై మాజీ సర్పంచ్ కటకం మల్లేశం ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ వాహనాలను అడ్డుకున్నారు. దీంతో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే తాము పాఠశాలలకు పంపిస్తామని పట్టుబట్టారు. చివరికి గ్రామంలోని 25 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆనందరెడ్డి, అనిల్‌రావు తెలిపారు.

శ్యామాప్రసాద్ జీవితం ఆదర్శనీయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: డాక్టర్ శ్యామాప్రసాద్ జీవితం ఆదర్శనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీస్‌లో సోమవారం నివాళి అర్పించారు. సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ మ్యాన రాంప్రసాద్, గరిపెల్లి ప్రభాకర్, నాగుల శ్రీనివాస్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు వైశాలి తదితరులు పాల్గొన్నారు.

రూ.8.60 కోట్లతో పద్మశాలీ భవనం



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: రూ.8.60కోట్లతో సిరిసిల్లలో పద్మశాలీ భవనం పనులు ప్రారంభించబోతున్నట్లు ఆ సంఘం పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ తెలిపారు. స్థానిక సంఘం ఆఫీస్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గతంలో నిధుల కొరతతో నిలిచిపోయిన పద్మశాలీ, మార్కండేయ ఆలయాల పనులు మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, తుమ్మల నాగేశ్వర్‌రావు, విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చొరవతో జరుగుతున్నాయన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, తాటిపాముల దామోదర్, రాపెల్లి ప్రవీణ్, మోర రవి, గాజుల బాలయ్య, కోడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చదువుకున్న బడికి ఎమ్మెల్యే చేయూత



చొప్పదండి ఎమ్మెల్యే సత్యంను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తాను చిన్న నాడు చదువుకున్న స్వగ్రామం కోరుట్లపేటలోని ప్రాథమికోన్నత పాఠశాలకు చేయూతగా నిలిచారు. బడిని సోమవారం పరిశీలించిన సందర్భంగా ఉపాధ్యాయుల కొరత ఉందని తెలుసుకొని.. విద్యావలంటీర్‌ను నియమించుకోవాలని ప్రతీ నెల వేతనంగా రూ.6వేలు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. తన ఊరిలోని బడిని అభివృద్ధి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యంను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు.

పాఠాలు చెప్పేవారేరి?

- 92 పాఠశాలల్లో సింగిల్ టీచర్!
- జిల్లాలో 307 పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న విద్యాబోధన
- సర్దుబాటుపైనే ఆశలు



గంభీరావుపేటలో విద్యాబోధన చేస్తున్న ఏకోపాధ్యాయిని



గంభీరావుపేటలోని దోసలగూడెం ఏకోపాధ్యాయ పాఠశాల

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోంది. జిల్లాలోని 92 స్కూళ్లలో సింగిల్‌టీచర్ విధులు నిర్వర్తిస్తుండగా.. 307 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. త్వరలో చేపట్టబోయే టీచర్ల సర్దుబాటు ప్రక్రియపైనే విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో..

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతీ తరగతికి తగిన ఉపాధ్యాయులు ఉండాలి. కానీ జిల్లావ్యాప్తంగా 92 పాఠశాలల్లో ఒక్క టీచరే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఒకే టీచర్ అన్ని తరగతులకు, అన్ని సబ్జెక్టులు బోధించాల్సిన బాధ్యతలతో అలసిపోతుండడంతో బోధన నాణ్యతపై ప్రభావం పడుతోంది. దీంతో విద్యార్థులకు గణితం, భౌతికశాస్త్రం, ఇంగ్లిష్ వంటి ప్రధాన సబ్జెక్టుల్లో బలహీనతలు ఏర్పడుతున్నాయి. ఇది అతికష్టమైనప్పటికీ ఉపాధ్యాయులు తమవంతు కృషి చేస్తుండగా.. విద్యార్థులు మాత్రం సరైన పాఠాలు, బోధనను పొందలేకపోతున్నారు.

జిల్లాలో 307 పోస్టులు ఖాళీలు

జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో 307 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్జీటీలు 190, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 11, ఫిజిక్స్ 6, బయోసైన్స్ 12, సోషల్ 17, ఆంగ్లం 10, తెలుగు 12, హిందీ 9, స్కూల్ అసిస్టెంట్ పీడీ 6, స్పెషల్ ఎడ్యుకేషన్ 8, లాంగ్వేజ్ పండిట్ పోస్టులు తెలుగు 6, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం 13, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ 7 చొప్పున ఖాళీగా ఉన్నాయి.

పాఠశాలల్లో సౌకర్యాలు ఉన్నా టీచర్ల కొరతతో అవి వృథాగానే మారుతున్నాయి. మౌలిక వసతుల వినియోగం, పాఠశాల నిర్వహణలో పనుల భారం నెలకొంటోంది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ పాఠశాలల్లో నాణ్యత గురించి మాట్లాడలేం.

సర్దుబాటుపైనే ఆశలు

జూలైలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ నిర్వహిస్తారని తెలుస్తోంది. విద్యార్థుల సంఖ్య లేని పాఠశాలల నుంచి అవసరమైన చోటుకు బదిలీచేసే ప్రక్రియతో విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందంటున్నారు. గత విద్యాసంవత్సరం నాటి విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని మండలాలు, జిల్లాల వారీగా ఎన్ని పాఠశాలల్లో ఎక్కువగా ఉపాధ్యాయులు ఉన్నారు? ఎన్ని చోట్ల అవసరమో.. గణాంకాలు తయారుచేసి సర్దుబాటు ప్రక్రియ చేస్తారని తెలుస్తోంది. జూలై 15 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తారని సమాచారం. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1–10 మంది విద్యార్థులుంటే ఒక టీచర్, 11 నుంచి 60 మంది ఉంటే ఇద్దరు, 61 నుంచి 90 వరకు 3, 91 నుంచి 120 వరకు 4, 121 నుంచి 150 వరకు 5, 151 నుంచి 200 వరకు విద్యార్థులుంటే ఆరుగురు టీచర్ల చొప్పున నియమించాల్సి ఉంటుంది. విద్యార్థుల సంఖ్య 200 దాటితే ప్రతీ 40 మందికి ఒక టీచర్ చొప్పున నియమించాల్సి ఉంటుంది.

తరగతికి ఒక టీచర్‌ను నియమించాలి



విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. ఖాళీలను భర్తీ చేయాలి. శాస్త్రీయమైన హేతుబద్ధీకరణ జరగాలి. ప్రాథమిక పాఠశాలల్లో కనీసం తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పనిభారం పెరుగుతోంది. వివిధ తరగతుల విద్యార్థులకు ఒకేసారి బోధించడం సాధ్యం కాదు. విద్యాప్రమాణాలు తగ్గుతాయి. **- పాతూరి మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

విద్యారంగం బలోపేతంపై దృష్టి పెట్టాలి



విద్యారంగంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. భావిభారత పౌరులను తీర్చిదిద్దే బడుల్లో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడుతోంది. జిల్లాలో దూరంగా ఉన్న గంభీరావుపేట మండలంలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థుల చదువుకు ప్రాధాన్యతనిస్తూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి.

- దోసల శంకర్, గంభీరావుపేట

మహిళలు గర్వపడేలా చీరలుండాలి



ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట సేకరణ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, నాయకులు మహేందర్‌రెడ్డి, చేనేత, జౌళి శాఖ జేడీ వెంకటేశ్వర్‌రావు

- ఆత్మగౌరవంతో కట్టుకోవాలి
- రాష్ట్రమంతటికీ సిరిసిల్ల చీరలు
- సకాలంలో ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి
- రూ.150కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి
- సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులు ఆత్మగౌరవంతో కట్టుకునేలా సిరిసిల్ల నేతన్నలు నాణ్యమైన చీరలను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల ఏఎంసీ గోదాంలో సోమవారం ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట సేకరణకు శ్రీకారం చుట్టారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నేతన్నలు, రైతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గతంలో కంటే మెరుగైన ఆర్డర్లను ఇచ్చామని, సకాలంలో వస్త్రాన్ని ఉత్పత్తి చేసి సిరిసిల్ల పేరు నిలబెట్టాలన్నారు. వేములవాడలో రూ.50కోట్లతో నూలుడిపోను ఏర్పాటు చేసి 90 శాతం అరువుపై అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికుల రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేశామని పేర్కొన్నారు. నేతన్నలకు 4.30 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వగా.. ఇప్పటి వరకు 65 లక్షల మీటర్లు తయారు చేశారని, జూన్ నెలాఖరులోగా 50 శాతం పూర్తి చేయాలని సూచించారు.

రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి

వేములవాడ రాజన్న ఆలయాన్ని రూ.150కోట్లతో నాలుగు ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నామని విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఇప్పటికే రూ.47.98కోట్లు కలెక్టర్ ఖాతాలో ఉన్నాయని, సిరిసిల్లలో పద్మశాలీ భవన్‌ను రూ.5కోట్లు, సిరిసిల్ల సంఘాల నుంచి మరో రూ.3కోట్లు సేకరించి రూ.8 కోట్లతో నిర్మిస్తామని, మార్కండేయ ఆలయాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ చీరల ఆర్డర్‌ను సకాలంలో పూర్తి చేయాలని, జూన్ నెలాఖరు నాటికి సగం ఆర్డర్ పూర్తి చేయాలని సూచించారు. సేకరణ పూర్తికాగానే ఉత్పత్తి చేసిన బట్టకు బిల్లులు అందుతాయని వెల్లడించారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, చేనేత, జౌళి శాఖ జేడీ ఎన్.వెంకటేశ్వర్‌రావు, ఏడీ రాఘవరావు, డీడీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, ఆడెపు చంద్రకళ, కాముని వనిత, కల్లూరి చందన, వస్త్రోత్పత్తిదారులు ఆడెపు భాస్కర్, గోవిందు రవి, మంచె శ్రీనివాస్, కార్మిక నాయకులు మూషం రమేశ్, కోడం రమణ, మాజీ కౌన్సిలర్లు, జౌళిశాఖ అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనతోనే బంగారు భవిష్యత్



2కే రన్‌లో పాల్గొన్న పట్టణ ప్రజలు

- ఎస్పీ మహేశ్ బీ గీతే
- సిరిసిల్లలో 2కే రన్

సిరిసిల్లక్రైం/ఇల్లంతకుంట(మానకొండూర్): డ్రగ్స్ నిర్మూలనతోనే భావితరాల భవిష్యత్ బాగుంటుందని.. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ మహేశ్ బీ గీతే కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనపై సిరిసిల్లలో సోమవారం చేపట్టిన 2కే రన్‌ను ప్రారంభించి మాట్లాడారు. డ్రగ్‌రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాల సమాచారాన్ని 87126 71111, డయల్ 100లో సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐలు మొగిలి, నాగేశ్వరరావు, నటేశ్, మధుకర్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవి, ఆర్‌ఐలు మధుకర్, రమేశ్, ఎస్సైలు కిరణ్‌కుమార్, రామ్మోహన్, శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీనివాస్, ఆర్‌ఎస్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట ఠాణాలో మొక్క నాటిన ఎస్పీ

ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. మత్తు పదార్థాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, టాస్క్‌ఫోర్స్ సీఐ నటేశ్, ఆర్‌ఐలు మధుకర్, యాదగిరి, ఎస్సై సిరిసిల్ల అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఘాట్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ మహేశ్ బీ గీతే, అధికారులు, పట్టణ ప్రజలు

బాధితులకు భరోసా గ్రీవెన్స్ డే

సమస్యల పరిష్కార లక్ష్యంగా, బాధితులకు భరోసాగా ఉండేందుకు ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే పేర్కొన్నారు. 36 ఫిర్యాదులు స్వీకరించి.. పరిష్కరించాలని ఆయా ఠాణాల అధికారులకు ఆదేశించారు. చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

నేడు రైతుభరోసా వేడుకలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలోని రైతువేదికల్లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు రైతుభరోసా వేడుకలు నిర్వహిస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి పంటసాగుకు పెట్టుబడి సాయాన్ని రైతుభరోసా పథకంలో రైతుల ఖాతాలో జమచేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు హైదరాబాద్ నుంచి రైతులతో ముఖాముఖీలో పాల్గొంటారని పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లాలోని ప్రతీ రైతువేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, రైతులు రైతువేదికల వద్దకు చేరుకునేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

పొగాకుతోనే క్షయవ్యాధి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పొగాకు తీసుకునే వారిలో ఎక్కువ మంది క్షయవ్యాధికి గురవుతున్నారని మండల వైద్యాధికారి సారియా అంజుమ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట పీహెచ్‌సీలో సోమవారం టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా 118 మందికి పైగా టీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. 14 మంది అనుమానితులను గుర్తించి పరీక్షల కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు షుగర్, క్యాన్సర్, బీపీతోపాటు పొగాకు తీసుకునే వారు క్షయవ్యాధికి గురవుతున్నట్లు తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

అన్నదాతా.. రైతువేదికకు రావా?

- కర్షకులను బతిమాలుకుంటున్న ఏఈవోలు
- సీఎం కార్యక్రమం కోసం ఏఈవోలకు టార్గెట్లు
- ప్రతీ ఆర్వీకి 200 మంది రైతులను తరలించాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 50 వేలకుపైగా రైతుల తరలింపు
- రైతులకు ఇచ్చే టీ, స్నాక్స్ డబ్బులు మాత్రం ఇవ్వరట
- మొన్నటి కార్యక్రమానికి పెట్టిన డబ్బులే రాలేదు



జిల్లా	రైతు వేదికలు	ఏఈవోలు
కరీంనగర్	75	71
జగిత్యాల	52	71
పెద్దపల్లి	54	52
సిరిసిల్ల	57	53

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రైతు వేదికల్లో ముఖ్యమంత్రితో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంతో ఏఈవో (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లు ఇబ్బందులు పడుతున్నారు. సీఎం కార్యక్రమానికి రైతు వేదిక(ఆర్వీ)ల వద్దకు రైతులను తరలించాలని జిల్లా వ్యవసాయాధికారులు టార్గెట్లు విధించడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రతీ ఆర్వీలో కనీసం 200 మందికి తగ్గకుండా రైతులను తరలించాలని ఆదేశాల్లో స్పష్టం చేయడంతో ఏఈవోలు ఇప్పుడు అదే పనిలో తలమునకలయ్యారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి వచ్చేందుకు మెజారిటీ రైతులు సుముఖంగా లేరు. ప్రస్తుతం చాలా చోట్ల వ్యవసాయ పనులు మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు సీఎంతో జరిగే ముఖాముఖిలో తప్పకుండా రైతుభరోసా లబ్ధిదారులతో సీఎం మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 వేలమంది రైతులకు ఏఈవోలు ఫోన్లు చేసి కార్యక్రమానికి రావాల్సిందిగా బతిమాలుతున్నారు.మొన్నామధ్య రైతుభరోసా ప్రారంభం సందర్భంగా కూడా రైతులతో ముఖ్యమంత్రితో ఇలాంటి కార్యక్రమాన్నే నిర్వహించారు. అప్పుడు ప్రతీ ఏఈవోలకు నిర్వహణ ఖర్చుల కింద రూ. 5 వేలు చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఆ కార్యక్రమంలో హాజరైన ప్రతీ రైతుకు టీ, స్నాక్స్‌ను ఏఈవోలే అందించారు. ఇందుకోసం వారే చేతి నుంచి డబ్బులు పెట్టుకున్నారు. ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయా? అని ఎదురుచూస్తుంటే.. తీరా మరోసారి అలాంటి కార్యక్రమమే నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చేసేది లేక మళ్లీ రైతులకు ఫోన్లు చేస్తూ.. చేతి చమురు వదిలించేందుకు సిద్ధమవుతున్నారు.

రైతు వేదికల్లో ఇబ్బందులివీ!

- చాలాచోట్ల తాగునీరు సదుపాయం లేదు
- కుర్చీలు వేసే సిబ్బంది లేరు
- టీ, స్నాక్స్ ఇచ్చే దిక్కు లేదు
- మరుగుదొడ్లు శుభ్రం చేసే వారు లేరు
- రైతు వేదికకు కనీసం ఊడ్చే సిబ్బంది లేరు
- టెక్నికల్ ఎక్విప్‌మెంట్‌కు డబ్బులు రావు,
- నిర్వహణకు సిబ్బంది లేరు..

ఏఈవోలపై పనిభారం..

వాస్తవానికి ప్రతీ రైతు వేదికలో ఒకే ఒక ఏఈవో ఉంటారు. రైతులకు సంబంధించిన ప్రతీ విషయం వీరే చేసుకోవాలి. పంటలకు సంబంధించి ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం. సాగులో సమస్యలు తలెత్తితే పరిష్కరించడం. పీఎం కిసాన్ యోజనకు సంబంధించి కేవైసీ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయడం, పంటల నమోదు చేయడం, రైతుబంధు, రైతు బీమా నమోదు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి మట్టి నమూనాల సేకరణ తదితర పనులు ఉంటాయి. ఇవి కాకుండా రైతు వేదిక నిర్వహణ బాధ్యతలు కూడా చూసుకుంటారు. వీరు తప్ప మరే ఇతర సిబ్బంది లేకపోవడంతో వీరే ఉదయం వచ్చి రైతు వేదికను ఊడ్చుకోవాలి, కార్యక్రమాలు జరిగినపుడు కుర్చీలు వేయడం, వారికి టీ స్నాక్స్.. కూడా వీరే అందించాల్సి వస్తోంది. అధికారిక కార్యక్రమాలు జరిగినపుడు వచ్చిన వారంతా మరుగుదొడ్లను వినియోగిస్తున్నారు. తరువాత డబ్బులు ఇచ్చి వాటిని శుభ్రం చేయించుకోవాల్సి వస్తోంది. మొత్తానికి ఏఈవోలు నిర్వహించే ప్రతీ అధికారిక కార్యక్రమం ఇంట్లో చేసే శుభకార్యంలా ప్రతీది దగ్గరుండి చూసుకోవాల్సిన స్థితి. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డిని వివరణ కోరగా.. ఏఈవోలకు రైతుల తరలింపు విషయంలో ఎలాంటి టార్గెట్ విధించలేదని, వారే స్వచ్ఛందంగా వస్తున్నారని సమర్థించుకున్నారు.

కరెంట్ కట్‌కట

- తరచూ అంతరాయం
- చినుకుపడితే చీకట్లే..
- అర్ధరాత్రి విద్యుత్‌కోతలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

బోయినపల్లి(వేములవాడ): జిల్లాలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. చినుకులు పడితే చాలు చీకట్లు కమ్ముకుంటున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రాలు, గ్రామాల్లో కరెంట్ కట్‌కట మొదలైంది. గతంలో ఎన్నడూ ఇలాంటి కరెంట్ కోతలు చూడలేదని ప్రజలు వాపోతున్నారు. ఆదివారం, సోమవారం రాత్రి వేళ కరెంట్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడింది. దీంతో బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండల కేంద్రాల్లో చీకట్లు అలుముకున్నాయి. అర్ధరాత్రులు కరెంట్ పోతే తిరిగి రావడం లేదని వాపోతున్నారు. గాలి, వాన ఏది లేకున్నా ఒక్కోసారి కరెంట్ ఎందుకు తీసేస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం వేళ కూడా తరచూ కరెంట్ పోతుండడంతో వివిధ పనులపై మండల కేంద్రాలకు వచ్చిన వారు బ్యాంకు, తపాలా, మీసేవల కోసం గంటల తరబడి అక్కడే ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చెట్లకొమ్మలు కొట్టినా తొలగని అంతరాయం

వర్షాకాలంలో ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విద్యుత్‌తీగలకు తగిలి కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇటీవల జిల్లా వ్యాప్తంగా చెట్లకొమ్మలు తొలగించారు. చెట్లకొమ్మలు తొలగించినా నిత్యం కరెంట్ పోతుండడంతో జిల్లా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంటల కోతలు పూర్తయినా విద్యుత్ అంతరాయ కలగడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సెస్ ఉన్నతాధికారులు స్పందించి బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండల కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



క్లుప్తంగా

హోటళ్లపై ఫారెస్ట్ అధికారుల దాడి



నాంపల్లిలోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

వేములవాడరూరల్: హోటళ్లలో వన్యప్రాణుల మాంసం విక్రయిస్తున్నారని సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఫారెస్ట్ అధికారులు వేములవాడ మండలంలోని నాంపల్లిలోని హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా వన్యప్రాణులను విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, హోటళ్లలో మాంసం విక్రయించొద్దని వేములవాడ సెక్షన్ ఆఫీసర్ అబ్దుల్ హుస్సేన్ హెచ్చరించారు. ఆయన వెంట సాయిబుస్సేన్, ప్రసాద్, స్వామి, రవి, సిబ్బంది ఉన్నారు.

అనుమతి లేని షెడ్డు తొలగింపు



కూల్చివేసిన షెడ్డు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మల్లిపల్లి శివారులో అనుమతులు లేకుండా రైస్‌మిల్లు యజమానులు షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని 'సాక్షి'లో అనుమతి లేని నిర్మాణాలు... పట్టించుకోని అధికారులు శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. సాక్షి కథనానికి స్పందించిన అధికారులు వెంటనే షెడ్డు కూల్చివేయాలని మల్లిపల్లి కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ కార్యదర్శి జేసీబీతో షెడ్డును కూల్చివేసినట్లు తెలిపారు. కూల్చివేత ఖర్చులు కూడా యజమానుల నుంచి వసూలు చేస్తామని తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన విద్యార్థి మహమ్మద్ తాజొద్దీన్(8) సోమవారం పాఠశాలకు వెళ్లి అదృశ్యమయ్యాడు. మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి అదృశ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న తాజొద్దీన్‌ను ఎవరైనా కిడ్నాప్ చేశారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి, విద్యార్థి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. తాజొద్దీన్ ఆచూకీ తెలిస్తే డయల్ 100 లేదా 87126 56374 లేదా 90004 57637లో సమాచారం అందించాలని ఎస్సై రమాకాంత్ కోరారు.

ఏషియన్ షాట్‌పుట్ పోటీలకు అడవిబిడ్డ



సక్కుబాయి

సిరిసిల్లటౌన్: ఏషియన్ పారా టైక్వాండో చాంపియన్ పోటీలకు జిల్లాకు చెందిన అడవిబిడ్డ భూక్య సక్కుబాయి ఎంపికయ్యారు. పంజాబ్‌లో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించిన ఓపెన్ సెలక్షన్స్ ట్రయల్ ఫర్ ఏషియన్ పారా టైక్వాండో చాంపియన్‌షిప్ జీ–4 పోటీలు జరిగాయి. వీర్నపల్లి మండలం బంగిరెడ్డిపల్లితండాకు చెందిన సక్కుబాయి బ్రొంజ్ మెడల్ సాధించారు. జూలై 28 నుంచి 30 వరకు మలేషియాలో జరిగే ఏషియన్ పోటీల్లో పాల్గొననుంది.

వ్యవసాయరంగ అభివృద్ధికి బాటలు

- డీఆర్‌డీవోను కలిసిన సమగ్ర రైతు సహకార సంస్థ ప్రతినిధులు



కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో శేషాద్రిని కలిసిన సమగ్ర రైతు సహకార సంస్థ ప్రతినిధులు

సిరిసిల్ల: జిల్లాలో వ్యవసాయరంగ అభివృద్ధికి బాటలు వేయాలని డీఆర్‌డీవో శేషాద్రి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం సమగ్ర రైతు సహకార సంస్థ ప్రతినిధులు డీఆర్‌డీవోను కలిశారు. డీఆర్డీవో శేషాద్రి మాట్లాడుతూ రైతులు ఆధునిక విధానాల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలన్నారు. కరీంనగర్ జిల్లాలో చేపడుతున్న విధానాలను రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ అమలు చేస్తామని సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జి.స్వప్నరెడ్డి తెలిపారు. సంస్థ అడ్మిన్ మేనేజర్ భాగ్యలక్ష్మి, డివిజన్ మేనేజర్ జింక నాగరాజు, ఎంతలు సాదియా, లక్ష్మణ్, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

సారూ.. పట్టించుకోండి

సిరిసిల్లఅర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టరేట్ బాట పట్టారు. గత వారం ప్రజావాణి రద్దు కావడంతో సోమవారం భారీగా తరలివచ్చారు. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, డీఆర్‌డీవో శేషాద్రిలు స్వీకరించారు. మొత్తం వివిధ సమస్యలపై 261 దరఖాస్తులు వచ్చాయి. సమస్యలు పరిశీలిస్తూ పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు.

- ప్రజావాణికి భారీగా తరలివచ్చిన అర్జీదారులు
- వివిధ సమస్యలపై 261 విన్నపాలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పెన్షన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి



ఉపాధి కోసం నా భర్త మలేషియా వెళ్లి చనిపోయాడు. మాకు ఎలాంటి ఆస్తులు లేవు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాం. నాకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు రిష్విత అంగవికలాంగురాలు. కదలలేని స్థితిలో ఉంది. కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించడం ఇబ్బందిగా ఉంది. నాకు విడో పెన్షన్, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి.

– తోట జయశ్రీ, శివనగర్

భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేయండి



నేను పట్వారీగా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. నా భార్య 2010లో మృతిచెందింది. నాకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు. 2010 నుంచి 2015 వరకు నా పెద్దకుమారై వద్ద ఉన్నాను. 2015 నుంచి 2024 వరకు చిన్నకుమారుడి వద్ద ఉన్నాను. గ్రామ పెద్దల సమక్షంలో ఇద్దరు కుమారులు చెరో నెల పోషిస్తామన్నారు. పెద్ద కొడుకు అశోక్ పట్టించుకోవడం లేదు. పెద్ద కొడుకు, కోడలు పేరిట చేసిన వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి.

– అమ్ముల గౌరయ్య, పెద్దలింగాపూర్(ఇల్లంతకుంట)

ఒర్రెను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



సిరిసిల్ల పట్టణ పరిధిలోని చిన్నబోనాలలో 40 ఏళ్లుగా ఉన్న ఒర్రెను, తొవ్వను కొందరు ఇటీవల పూడ్చివేశారు. పెద్దచెరువు నుంచి వచ్చే కాల్వను మలుపడంతో మా భూమిలోకి వరద నీరు వచ్చే ప్రమాదం ఉంది. పంట నష్టపోతాం. పెద్దచెరువు కాలువను, ఒర్రెను పూడ్చివేసిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి.

– నిమ్మల రాజు, చిన్నబోనాల(సిరిసిల్ల)

కొడుకుకు పింఛన్ ఇప్పించండి

మాది గంభీరావుపేట మండలం గజసింగవరం. నాకు ఒక్కగానొక్క కొడుకు పోతు సిద్ధిరాములు(65)కు మాట పడిపోయింది. నాలుగేళ్ల క్రితం నా కోడలు లక్ష్మి మృతిచెందింది. పక్షవాతంతో ఐదేళ్లుగా కొడుకు నడవలేని స్థితిలో ఉన్నాడు. నా కొడుకుకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి.



– పోతు నర్సవ్వ, గజసింగవరం(గంభీరావుపేట)

గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయండి

నాకు సమాచారం ఇవ్వకుండా ఇల్లు, ఖాళీ స్థలాన్ని నా రెండో కూతురు పాతూరి పద్మ గిఫ్ట్ డీడ్ చేయించుకుంది. పెన్షన్ కోసమని చెప్పి సంతకాలు చేయించుకొని భూమిని ఆమె పేరు మీద మార్చుకుంది. ఆ గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, తిరిగి నా పేరిట పట్టా చేయండి.

– సోమిరెడ్డి లక్ష్మి, బందనకల్ (ముస్తాబాద్)



గూడు చెదిరింది..గుండె పగిలింది

- షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం
- రోడ్డునపడిన కుటుంబం



రోదిస్తున్న బాధిత కుటుంబం

వేములవాడరూరల్: కూలీ పనులు చేసుకుంటూ ఆ కుటుంబం సంతోషంగా ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంటికి నిప్పంటుకుంది. ఫైరింజన్ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చేలోపే సగం ఇల్లు కాలిపోయింది. ఇంట్లోని ఎలాంటి వస్తువు మిగులలేదు. ఈ సంఘటన చూసిన చుట్టుపక్కల వారు స్పందించి తోచిన సాయం అందించారు. ఇది వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొర్రె మైసయ్య కుటుంబసభ్యులు మధ్యాహ్నం పనులపై బయటకు వెళ్లారు. అదే సమయంలో ఇంటి నుంచి దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోపే ఇల్లు కాలిపోతుందన్న విషయాన్ని ఫైరింజన్ అధికారులకు తెలిపారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేవు. ఇంట్లో ఉన్న వస్తువులు, నగదు, బంగారంతోపాటు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎలాంటి వస్తువులు లేకవడంతో ఆ కుటుంబాన్ని అయ్యోపాపం అంటూ తోచిన సహాయం అందించారు. కాలిబూడిదైన ఇంటిని చూసి కుటుంబసభ్యులు గుండెలు పగిలేలా రోదించారు. విషయం తెలుసుకున్న రూ రల్ ఆర్ఐ బాలు సంఘటన స్థలానికి వెళ్లి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలంటూ గ్రామస్తులు విన్నవించుకున్నారు.

బాధితులకు విప్ భరోసా

మండలంలోని హన్మాజీపేట గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో గొర్రె మైసయ్య ఇల్లు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని సోమవారం సాయంత్రం పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటానంటూ మనోధైర్యం కల్పించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. సెస్ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తక్షణమే సహాయం అందించాలని ఆదేశించారు. వారి కుటుంబానికి నిత్యావసర వస్తువులు, ఇందిరమ్మ ఇల్లు వెంటనే మంజూరుకు హామీ ఇచ్చారు.

సిరిసిల్ల 'సెస్' ఎండీగా మోహన్‌రెడ్డి



చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ తిరుపతిలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎండీ మోహన్‌రెడ్డి

సిరిసిల్ల: సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా పిన్నింటి మోహన్‌రెడ్డి సోమవారం విధుల్లో చేరారు. గతంలో 'సెస్' ఎండీగా పనిచేసిన విజయేందర్‌రెడ్డి దీర్ఘకాలిక సెలవు పెట్టి అమెరికా వెళ్లారు. ఆయన స్థానంలో ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్‌గా రిటైర్డు అయిన మోహన్‌రెడ్డిని నియమిస్తూ 'సెస్' పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఆయన 'సెస్' ఇన్‌చార్జి ఎండీ, అకౌంట్స్ ఆఫీసర్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎన్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న మోహన్‌రెడ్డి నెలకు రూ.2.50లక్షల వేతనంతో 'సెస్' మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు గౌరినేని నారాయణరావు, కొట్టెపల్లి సుధాకర్, ఉద్యోగులు ఎండీకి శుభాకాంక్షలు తెలిపారు.

దర్గావళిపై అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సింగారం గ్రామ శివారులో దర్గావళి గుట్టపై ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ కట్టడాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి వాటిని కూల్చివేయాలని కోరారు. పొన్నాల తిరుపతిరెడ్డి, కంచర్ల పర్శరాములు, పారిపల్లి సంజీవరెడ్డి, ఆంజనేయులు, బందారపు లక్ష్మారెడ్డి, సాయి, నంది నరేశ్, దయాకర్‌రెడ్డి, రంజిత్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన చేపల విక్రయాలు



విక్రయాలు లేక బోసిపోయిన సిరిసిల్ల ఫిష్ మార్కెట్

- రైతుబజార్‌కు రావాలంటున్న అధికారులు
- పాతమార్కెట్లో నిషేధంపై గంగపుత్రుల నిరసన
- పక్షం రోజులుగా కొలిక్కిరాని సమస్య

సిరిసిల్లటౌన్: ఏళ్లుగా చేపల విక్రయాలు కొనసాగిస్తున్న పాతమార్కెట్ పక్షం రోజులుగా బోసిపోయింది. రైతుబజార్‌లో విక్రయించుకోవాలని అధికారులు సూచించగా.. అక్కడ వ్యాపారం సరిగ్గా జరుగడం లేదని గంగపుత్రులు పేర్కొంటున్నా రు. అధికారుల సూచనలతో ఈనెల 15న రైతుబజార్‌లో చేపలు విక్రయించేందుకు దుకాణాలు పెట్టుకుంటే వ్యాపారం పెద్దగా జరుగలేదని వాపోతున్నారు. అధికారులు పాతమార్కెట్‌లో వద్దనడంతో గంగపుత్రులు పూర్తిగా చేపల అమ్మకాలనే బంద్ చేశారు.

బోసిపోయిన ఫిష్ మార్కెట్

సిరిసిల్లలోని పాతకూరగాయల మార్కెట్ ప్రాంగణంలోనే దశాబ్దాలుగా ఫిష్, మటన్ మార్కెట్లు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతుబజార్ నిర్మించగా.. ఆ సమయంలోనే ఫిష్, మటన్ మార్కెట్లను అక్కడికి తరలించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ శివారులోని కొత్త రైతుబజారుకు వినియోగదారులు తక్కువగా వస్తుండడంతో చేపలు, మటన్ మార్కెట్లు పాత మార్కెట్లోనే కొనసాగుతున్నాయి.ఆ సమయంలో రైతుబజారులోకి కూరగాయల రైతులను, అడ్తీదారులను మాత్రమే తరలించారు. పాతకూరగాయల మార్కెట్లో వ్యాపారులు మాత్రమే కూరగాయలు, పండ్ల వ్యాపారాలు చేసుకుంటున్నారు. గంగపుత్రులు మాత్రం పాతమార్కెట్లోనే చేపలు విక్రయిస్తామని విన్నవించగా.. ప్రజాప్రతినిధులు, అధికారులు అంగీకరించడం లేదు. దీంతో గత పదిహేను రోజులుగా సిరిసిల్లలో చేపల విక్రయాలు నిలిచిపోయాయి.

సంప్రదింపులు చేపడుతున్నాం

చేపల మార్కెట్‌ను రైతబజారులో ఏర్పాటుకు గంగపుత్రులతో సంప్రదింపులు చేపడుతున్నాం. వారి సంఘం ఎన్నికల నేపథ్యంలో కొద్దిరోజులు చేపల విక్రయాలు నిలిపివేశారు. రైతుబజారులో మంచి వాతావరణంలో ఫిష్, మటన్ మార్కెట్ల ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఫిష్, మటన్ వ్యాపారులు ఇక్కడకు వస్తే వసతులు కల్పిస్తాం.

– వెల్ముల స్వరూపరెడ్డి, ఏఎంసీ చైర్మన్

అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌తో నిరంతర విద్యుత్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌తో వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా సోమవారం ప్రారంభించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 18 వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సెస్ ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్, లైన్‌మెన్ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, రాంరెడ్డి, బండారి బాల్‌రెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, మహేందర్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, హెల్పర్ సతీశ్ పాల్గొన్నారు.

హన్మాజీపేట బడి.. 'జ్ఞాన'వెలుగుల గుడి

- మేధావుల పుట్టినిల్లు ఈ హైస్కూల్
- జ్ఞానపీఠానికి ఎదిగిన సినారె
- ఎస్‌యూ వీసీగా మల్లేశం



హన్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

వేములవాడ: పెద్దబడిగా పిలుచుకునే హన్మాజీపేట సర్కారు బడి మేధావులకు పుట్టినిల్లు. జ్ఞానపీఠం అందుకున్న సినారె.. ఒగ్గుకళాకారుడు మిద్దె రాములు.. ఎస్‌యూ వైస్‌చాన్స్‌లర్ సంకసాల మల్లేశం.. ఇలా చెప్పుకుంటే పోతే పెద్ద జాబితానే ఉంటుంది. వేములవాడరూరల్ మండలం హన్మాజీపేట హైస్కూల్‌లో అక్షరాలు దిద్దిన ఎందరో నేడు అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. సీఎం కార్యాలయంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కొండబత్తిని శంకర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన తీగల రవీందర్‌గౌడ్, హైకోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా విధులు నిర్వహించిన తీగల రాంప్రసాద్‌గౌడ్.. వంటి వారెందరో ఇక్కడ చదువుకున్నవారు. కవులు, కళాకారులు, క్రీడాకారులు, మీడియారంగ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ బడిబిడ్డలే.

75 ఏళ్ల వజ్రోత్సవాలు

పదూర్లకు మధ్యలో ఉన్న హన్మాజీపేట బడి ఆ గ్రామాల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పింది. పాఠశాల పుట్టి 75 ఏండ్లు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఇటీవల పూర్వ విద్యార్థులు వజ్రోత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. దాదాపు 2వేల మంది పూర్వవిద్యార్థులు రెండు రోజులపాటు పండుగ చేసుకుని మురిసిపోయారు. విద్యాబుద్ధులు నేర్పించిన అధ్యాపకులను సన్మానించారు.

జ్ఞానపీఠం.. సినారె



డాక్టర్ సి.నారాయణరెడ్డి హన్మాజీపేట స్కూల్‌లోనే అక్షరాభ్యాసం మొదలుపెట్టి కవిగా, రచయితగా ప్రపంచఖ్యాతి గడించారు. దేశంలోనే అత్యున్నతమైన జ్ఞానపీఠ అవార్డు అందుకున్నారు. రాజ్యసభ సభ్యుడిగా విధులు నిర్వహించి ఈ ప్రాంతాభివృద్ధిలో భాగస్వాములయ్యారు.

సీఎం సెక్రటరీగా శంకర్



హన్మాజీపేట స్కూల్‌లో చదువుకున్న కొండబత్తిని శంకర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్న సమయంలో మూడేళ్లపాటు ముఖ్యమంత్రి ప్రైవేట్ సెక్రటరీగా, అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ వద్ద ఓఎస్‌డీగా 2023 వరకు కొనసాగారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం కార్యదర్శికి ప్రైవేట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

లెక్చరర్‌గా ఆడెపు నారాయణ



హన్మాజీపేట హైస్కూల్‌లో 1979 వరకు చదువుకుని ఉన్నత చదువులతో రాణించి ప్రభుత్వ లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. తాను చదువుకున్న బడిలోనే టీచర్‌గా పనిచేసే భాగ్యం కూడా లభించిందని చెబుతుంటారు.

వైస్‌చాన్స్‌లర్.. సంకసాల మల్లేశం



హన్మాజీపేట స్కూల్‌లో చదువుకున్న ప్రొఫెసర్ సంకసాల మల్లేశం శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా విధులు నిర్వహించారు. 2003లో నిజాం కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా, 2010లో ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిలాసఫీ హెడ్‌గా, 2012లో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, 2014లో ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్‌గా విధులు నిర్వహించారు.

జెడ్పీ చైర్మన్‌గా తీగల రవీందర్‌గౌడ్



హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తీగల రవీందర్‌గౌడ్ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జెడ్పీటీసీగా ప్రజాసేవ చేస్తూ వేములవాడ ఎంపీపీగా, ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా సేవలందించారు.

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



హన్మాజీపేట హైస్కూల్‌లో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. గతంలో చదువుకున్న వారు గొప్ప స్థానాలకు ఎదిగారు. వారి పేరు ప్రఖ్యాతులతో మా బడికి గొప్ప పేరు వచ్చింది. ఇప్పటికీ ఆ పేరు కాపాడుతున్నాం. పెద్ద గ్రౌండ్, బోధన సిబ్బంది ఉన్నారు. మా బడిలో చేరండి.. మంచి విద్య అందిస్తున్నాం.

– శ్రీకాంత్‌రావు, హన్మాజీపేట, హెచ్ఎం



హరహర మహాదేవ

వేములవాడ: 'హరహర మహాదేవ..శంభోశంకర' నామస్మరణతో వేములవాడ మారుమోగింది. వేములవాడ రాజన్నను సోమవారం 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.30లక్షల ఆదాయం సమకూరింది. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం పంపిణీ, దీపాల వెలిగింత, కోడెమొక్కులు చెల్లించుకున్నారు.




చోరీ కేసుల్లో వ్యక్తికి జైలు

సిరిసిల్లకల్చరల్: రెండు చోరీలకు పాల్పడ్డ నిందితుడికి ఒక కేసులో 5 నెలల 14 రోజులు, మరో కేసులో 3 నెలల 14 రోజులు జైలుశిక్ష విధిస్తూ సోమవారం ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెలువరించారు. 2025 జనవరి 9న బల్యాలనగర్‌కు చెందిన బల్యాల వినయ్ తన బైక్‌ను గాంధీనగర్ హనుమాన్ గుడి దగ్గర పార్క్ చేశాడు. ఒక గంట తర్వాత వచ్చి చూసేసరికి బండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు ఇల్లంతకుంటకు చెందిన దుర్మెట్ట నరేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అలాగే 2014 అక్టోబర్ 8న మరో ద్విచక్రవాహనాన్ని తన షాపు ముందు పార్క్ చేసి సాయంత్రం తిరిగి వచ్చి చూడగా వాహనం చోరీకి గురైందని గుర్తించిన యజమాని నెహ్రూనగర్‌కు చెందిన దేవనపల్లి విష్ణుప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులోనూ నిందితుడు దుర్మెట్ట నరేశ్‌గా పోలీసులు గుర్తించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ చెలుమల సందీప్ కేసు వాదించగా సాక్ష్యాధారాలను పరిశీలించిన తరువాత నిందితుడికి మొదటి కేసులో 5 నెలల 14 రోజులు, రెండో కేసులో 3 నెలల 14 రోజులపాటు కారాగార శిక్ష విధించారు.

దాడి కేసులో ఒకరికి జైలు

సిరిసిల్లకల్చరల్: ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో నిందితుడికి 4 నెలల 23 రోజుల జైలుశిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పునిచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాలు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నక్క భార్గవ్‌పై కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి తిరిగొస్తున్న దారిలో పాతకక్షలను మనసులో పెట్టుకుని అడ్డగట్ల శివ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో భార్గవ్ తలకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై సీహెచ్.శ్రీకాంత్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశాడు. నలుగురు సాక్షులను విచారించిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో నిందితుడికి 4 నెలల 23 రోజుల జైలు శిక్ష విధించింది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: రైతులకు భరోసా ఇచ్చేది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా నిధుల విడుదలపై మండలంలోని చిప్పలపల్లి, చీకోడు గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, కొప్పు రమేశ్, కొండల్‌రెడ్డి, రాజు, గుండెల్లి శ్రీనివాస్, బాల్‌రెడ్డి, రాజలింగం, శ్రీను, నరేశ్ పాల్గొన్నారు.